క్లుప్తంగా

మర్లు పాఠశాలలో తనిఖీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మర్లు ప్రాథమిక పాఠశాలను ఏఎంఓ శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. వివిధ అంశాలపై విద్యార్థులను ప్రశ్నలను అడిగారు. మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచార ఉద్యమంలో భాగంగా 'ప్రగతికి తొలిమెట్టు'కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యదర్శి వేణుగోపాల్, డాక్టర్ రాంకిషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జనార్దన్‌రెడ్డి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పెబ్బేర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు పాడిరైతులు వరి గడ్డి కోసం అడ్డాకుల మండలం పొన్నకల్‌కు ట్రాక్టర్‌లో వచ్చారు. గడ్డి వేసుకుని మంగళవారం ఉదయం రాంపూర్ వెళ్తుండగా కాటవరం శివారులో ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన కంటెయినర్ తగిలింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న నానీ కిందపడ్డాడు. అతడికి కుడి కాలు తొడ భాగంలో ఫ్యాక్చర్ అయింది. బాధితుడిని ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థికి సన్మానం

మహమ్మదాబాద్: యువకులు క్రీడల్లో రాణించాలని గాధిర్యాల్ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడు హెచ్ హర్షవర్ధన్ అండర్ 17లో జాతీయస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపిక కావడంతో గ్రామస్తులంతా ఘనంగా సన్మానించారు. ఉపసర్పంచ్ రామకృష్ణ, యువకులు కృష్ణయ్య, నర్సింహారెడ్డి, బాల్‌రాజ్, చంద్రయ్య, రమణారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్యలో ముందంజలో ఉన్న విద్యార్థుల కళాశాల ఫీజులకు విద్యానిధి ద్వారా సహాయం అందిస్తున్నట్లు పాలమూరు రెడ్డిసేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం సమితి కార్యాలయంలో బీటెక్ విద్యార్థులు పి.సుచరిత, వర్షిత్‌కుమార్‌రెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.10వేలు సాయం అందజేశారు. ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు

మహమ్మదాబాద్/గండేడ్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మహమ్మదాబాద్, రంగారెడ్డిపల్లి, బైస్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ సంఘాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పచారం

సాక్షినెట్‌వర్క్: జిల్లా కేంద్రంలోని శివశక్తినగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. విలేకరుల సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు.

నిర్లక్ష్యం వీడాలి

చిన్నచింతకుంట: చెక్‌డ్యాం తొలగింపుపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను తొలగించాలని మంగళవారం చిన్నచింతకుంట బంద్ నిర్వహించారు. బస్టాండ్‌కూడలిలో రాస్తారోకో చేశారు. కలెక్టర్‌కు తెలిపినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా తొలగించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్, మండల అధ్యక్షుడు దశరత్ పాల్గొన్నారు.

అభివృద్ధి బీజేపీతోనే

పాలమూరు: రాబోయో రోజుల్లో పాలమూరు అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యం అవుతుందని అభ్యర్థి మిథున్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రవీంద్రనగర్, బ్రహ్మణవాడి, బండ్లగేరి, కుమ్మరివాడి, కురిహినిశెట్టి కాలనీలో మంగళవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నుంచి పలువురు బీజేపీలో చేరారు.

క్విజ్ పోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక లక్ష్మీనగర్‌లోని సాయి మందిర్ లో మంగళవారం విద్యార్థులకు 'భారత్ కో జానో'పై భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 15 పాఠశాలల నుంచి 60 మంది పాల్గొన్నారు. విజేతలకు దాతలు వి.సుదర్శన్ రూ.ఐదు వేలు, రాఘవరెడ్డి రూ.1,116 చొప్పున బహుమతి ప్రదానం చేశారు. ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, బీవీపీ పాలమూరు శాఖ అధ్యక్షుడు పి.రమేష్‌చందర్, సంఘం రాష్ట్ర సలహాదారు ఎస్.భూషణ్‌పాండే, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల 'కష్టాలు'...

- తనిఖీలతో సామాన్యులకు తప్పని ఇబ్బందులు
- డబ్బులు, బంగారంతో వెళ్లడానికి జంకుతున్న వైనం
- వ్యాపారులకు అగ్నిపరీక్షే



నంచర్ల గేటులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గండేడ్: అక్టోబర్ 25న హైద్రాబాద్‌కు చెందిన ఓ కుటుంబం గృహప్రవేశం నిమిత్తం గండేడ్‌కు వచ్చారు. అనంతరం తిరిగి వెళ్లే సమయంలో మెడలో ఉన్న కొంత బంగారాన్ని తీసి ఎప్పటిలాగా బ్యాగులో వేసుకున్నారు. హన్వాడ వద్ద చేపట్టిన తనిఖీల్లో బంగారం(మూడు తులాలు) బయటపడింది. దీంతో పోలీసులు దానికి సంబంధించిన పత్రాలు చూయించి తీసుకెళ్లాలని సదరు కుటుంబానికి సూచించారు. అయితే అది గతంలో తెచ్చుకున్న బంగారమని ఫంక్షన్ అయిపోయిన వెంబడే తీసి బ్యాగులో పెట్టుకున్నామని చెప్పినా వారు అంగీకరించలేదు. చివరికి బంగారానికి సంబంధించిన పాత ఫొటోలు, మెడలో వేసుకున్న ఫొటోలు చూయిస్తే వదిలిపెట్టారు.

⇨ నారాయణపేట్ జిల్లా కోస్గి మండలం సర్జాఖాన్‌పేట్‌కు చెందిన నితీష్ కోడంగల్‌లో ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తున్నాడు. దసరాకు కస్టమర్‌కు ట్రాక్టర్ డెలివరీ ఇచ్చాడు. దాని తాలుకు సంబంధించి రూ. 50వేలు తీసుకొని మహబూబ్‌నగర్ ఆఫీస్‌లో కట్టడానికి బయలు దేరాడు. నంచర్ల గేటు వద్ద పోలీసులు తనిఖీలు చేయడంతో డబ్బులు కనబడ్డాయి. తాను ట్రాక్టర్ తాలుకు డబ్బులు ఆఫీసులో కట్టడానికి వెళుతున్నాని చెప్పినా వారు వినలేదు. షోరూం ఓనర్‌తో కూడా పోలీసులు మాట్లాడారు. కస్టమర్ సంబంధించిన పత్రాలు కూడా చూయించారు. నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మాత్రమే మినహాయింపు ఉంది. కానీ అతని దగ్గర అదనంగా ప్యాకెట్‌లో కేవలం రూ.500 ఎక్కువగా ఉండడంతో పోలీసులు పట్టుకున్నారు. ఎంత మొరపెట్టుకున్నా వదిలిపెట్టలేదు. నగదు సీజ్ చేశారు.

ఇలా ఒకటి కాదు నిత్యం ఎన్నో ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్నికల నిబంధనలు సామాన్యుడికి సంకటంగా మారాయి. నిబంధనల పేరుతో అడుగడుగునా తనిఖీలు చేపడుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు. నగదు పంపిణీని కట్టడి చేయాలన్న ఉద్దేశ్యంతో ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా అన్ని జిల్లా ,రాష్ట్ర సరిహద్దుల్లో భారీ బందోబస్తుతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలో నంచర్ల గేటులో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీంతో పాటు మండలం సరిహద్దు పక్క జిల్లా అయిన నారాయణపేటలో సంపల్లి వద్ద , వికారాబాద్ జిల్లా కుల్కచర్ల వద్ద చెక్‌పోస్టుతో పాటు హన్వాడ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలోనే గృహ ప్రవేశాలు, పెళ్లిళ్లతో పాటు ఇతర శుభకార్యాల కోసం సామగ్రి, దుస్తులు, బంగారం, వాహనాలు కొనే వారు హైదరాబాద్, మహబూబ్‌నగర్ లేదా నారాయణపేటకు వెళ్లాలంటే కనీసం నాలుగు చెక్‌పోస్టులను దాటాల్సి వస్తోంది. అందువల్ల నగదు, బంగారం వంటివి వెంట తీసుకెళ్లడానికి జంకుతున్నారు. ఆస్పత్రి అవసరాల కోసం నగదు తీసుకెళ్లినా ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు సైతం బోరు మోటార్లు, ఫెన్సింగ్, పైపులైన్ , డ్రిప్ ఇలాంటివి చేసుకోవడానికి డబ్బులు తీసుకెళ్లడానికి జంకుతున్నారు. తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నారు. వ్యాపారులకు కూడా నిబంధనలు అగ్నిపరీక్షగానే మారాయి. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల నుంచి డబ్బులు పట్టుకోవాలని, తమ లాంటి సామాన్యులను ఇబ్బంది పెట్టడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలే



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. డబ్బు, బంగారం, మద్యం తరలిస్తూ పట్టుబడితే చర్యలు తప్పవు. రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు ఉంటే సీజ్ చేస్తాం. బంగారం 10 తులాల కంటే ఎక్కువగా ఉండరాదు. అలాగే ఎక్కువ మొత్తంలో మద్యం దొరికినా పట్టుకొని కేసులు నమోదు చేస్తాం.

– సురేష్, ఎస్‌ఐ, మహమ్మదాబాద్

అభివృద్ధే గెలిపిస్తుంది : మంత్రి



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ రూరల్: తొమ్మిది సంవత్సరాల్లో చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సద్దల్‌గుండు, న్యూ ప్రేమ్‌నగర్ తదితరల ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో కలిసి కరపత్రాలను అందిస్తూ ఓటు అభ్యర్థించారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత లారీ యజమానులకు ప్రభుత్వం అండగా నిలిచిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ఆర్‌టీఏ వేధింపులు లేకుండా చేశామని, ఓవర్ లోడ్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామని ఆయన అన్నారు. మంగళవారం కోయిల్ కొండ ఎక్స్ రోడ్డు సమీపంలో ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత యూనియన్ నాయకులపై ఉందన్నారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, నాయకులు మోసిన్, రాజేందర్, ఎండి చాంద్ పాషా, జహంగీర్ పాషా, బాబుజాన్, ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి

హైదరాబాద్ స్థాయిలో మహబూబ్ నగర్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, వాటర్ ట్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని గమనించాలని, ఇంకా ఏమైనా సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రికి ఉంటామని వారు హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్లు జగపతి రావు, సాయిలు, రాజసింహుడు, బాలరాజు, లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బీఆర్‌ఎస్‌పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. 9వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు, అనంతరం మోటర్ లైన్ మెయిన్‌కమిటీ అసోసియేషన్ సభ్యులు 30 మంది , దివిటిపల్లికి నాయకులు మంగళవారం స్థానిక ఫాం హౌస్‌లో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

మంత్రికే మా మద్దతు

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానించామని మంగళవారం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నిరంతర కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అప్పం అనంతరాములు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తాము ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతున్నట్లు మేమాన్ కమ్యూనిటీ అధ్యక్షుడు ఎంఏ రవూఫ్, నాయకులు సిరాజ్ మర్చానీ, ఎంఏ రషీద్, ఎండీ మునాఫ్ స్పష్టం చేశారు. ఈ మేరకు హబీబ్‌నగర్‌లో ఓ కార్యక్రమానికి మంత్రిని ముఖ్య అతిథిగా ఆహ్వానించి సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్, జామియా మసీద్ ప్రెసిడెంట్ మహబూబ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటాలని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. మంగళవారం ఆయా క్రీడా జట్లను డీఈఓ పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండవచ్చన్నారు. జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని కోరారు. రెండో రోజు మ్యాచుల్లో అపెక్స్ స్కూల్ జట్టు 94 పరుగుల తేడాతో గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్ జట్టుపై, గీతశ్రీ జట్టు 9 పరుగుల లేడాతో కేశవరెడ్డి స్కూల్ జట్టుపై, ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూటౌన్ జట్టు 16 పరుగుల తేడాతో రేయిన్‌బో స్కూల్ జట్టుపై, ఉదయ మెమోరియల్ జట్టు 7 వికెట్ల తేడాతో చైతన్య స్కూల్ జట్లపై విజయం సాధించాయి. అదే విధంగా వాకోవర్‌లో లుంబిని స్కూల్ గెలుపొందింది. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

భగీరథ నీటి లీకేజీలపై నిర్లక్ష్యం

నవాబుపేట: మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీలు ఉన్న వాటిని అధికారులు పట్టించుకోకపోవటంతో నీరంతా వృథాగా పోతోంది. రుక్కంపల్లి సమీపంలో పైపులైన్ పగిలి వారం రోజులుగా లీకేజీ అవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రజాప్రతినిధులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే లీకేజీలు మరమ్మతు చేసి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్ల వైద్య శిబిరం

నవాబుపేట: మండల కేంద్రంలో మంగళవారం సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేసి కావాల్సిన వారికి మందులు అందించారు. సంఘం అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ ప్రతి నెలా శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు వెంకటేశ్వరప్ప, విజయ్‌కుమార్, స్వామి, పండారినాథ్, వెంకటయ్య, వేణునాథం, చిన్నయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన వరం

బాలానగర్: కేసీఆర్ పాలన వరమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సూరారం, మేడిగడ్డతండా, గంగాధర్‌పల్లి గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇబ్బందులు తప్పవని, వారిని నమ్మవద్దని అన్నారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు...

హన్వాడ: ఓ వ్యక్తి ఇంట్లో నుంచి దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి నాలుగు రోజులుగా కనిపించకపోవడంపై మంగళవారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. కొనగట్టుపల్లికి చెందిన ఇప్పలి అంజిలయ్య ఈనెల 4న మాదారం శివారులోని ర్యాకమకొండకు వెళ్లి వస్తానని ఇంట్లోంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు బంధువులను సంప్రదించారు. ఫలితం లేకపోవడంతో ఆయన భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ పేర్కొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

చిన్నచింతకుంట: ఎన్నికల్లో ఆలోచించి పనిచేసే నాయకుడికే ఓటు వేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని నెల్లికొండి, సీతరాంపేట, ధమగ్నాపూరం, ఉంద్యాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు బీసీలు అంటే చిన్నచూపని కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆలకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, జానంపేట గ్రామాల్లో మంగళవారం ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి స్థానిక అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూప, ఎంపీఓ సరోజ, కార్యదర్శులు కృష్ణ, మాధవి తదితరులు ఉన్నారు.

పేద కుటుంబానికి సాయం

బాలానగర్: మండల కేంద్రానికి చెందిన మొల్గర బాలయ్య మృతి చెందడంతో ఇబ్బందుల్లో పడిన ఆయన భార్య రమాదేవి, కుమారుడు మల్లేష్‌తో కలిసి ఎలాంటి కప్పులేని కవర్లతో కప్పిన ఇటుకల ఇంట్లో ఉండేది. విషయంపై పలుమార్లు నాయకులను మొరపెట్టుకున్నా ఎవరూ సాయం చేయడానికి ముందుకు రాలేదు. ఈ క్రమంలోనే మండల బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు గుడిసెల యాదయ్య సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఇటుకల గోడలపై సిమెంట్ రేకులు వేయించారు. ఆయనను పలువురు సన్మానించారు.

యువ మోర్చా అధ్యక్షుడిపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని బండ్లగేరిలో మంగళవారం బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి ప్రచారం చేస్తున్న సమయంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకుడు పాల సతీష్ అసభ్యకరంగా దూషించి, అతడిపై దాడి చేశాడని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు మిథున్‌రెడ్డి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టేషన్ వద్ద కూర్చుని ధర్నా చేశారు. కాగా పాల సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు వెల్లడించారు.

కార్యకర్తల కోసమే పోటీ

దేవరకద్ర: కార్యకర్తల కోరిక మేరకే దేవరకద్ర నుంచి నామినేషన్ వేశానని స్వతంత్ర్య అభ్యర్థి బోయరాము తెలిపారు. మంగళవారం ఆయన నామినేషన్ దాఖలు చేసిన తరువాత విలేకరులతో మాట్లాడారు. కురుమూర్తి, అమ్మాపూర్ గ్రామాల నుంచి బీజేపీ ఎంపీటీసీగా పదవిలో ఉన్నానని అక్కడ తనకు ఉన్న కార్యకర్తలు పోటీ చేయాలని సూచించడంతో నామినేషన్ వేశానని తెలిపారు.

భరోసా కల్పించేందుకు పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

భూత్పూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు భరోసా కల్పించే నేపథ్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం అడిషనల్ ఎస్పీ సురేష్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో మున్సిపాలిటీలోని ప్రధాన వీధులు, అమిస్తాపూర్‌తో పాటు మండలంలోని ఎల్కిచర్ల, మద్దిగట్ల, కొత్తమొల్గర గ్రామాల్లో కవాతు చేపట్టినట్లు వివరించారు. ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగుల శ్రేయస్సే ముఖ్యం



పరీక్షలు చేయించుకుంటున్న ఎస్‌ఈ శ్రీరాంమూర్తి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల శ్రేయస్సే ముఖ్యమని ..వారు క్షేమంగా ఉంటేనే ప్రజలకు సేవలు చేయడానికి వీలుంటుందని ట్రాన్స్ కో ఎస్‌ఈ శ్రీరాంమూర్తి అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌భవన్‌లో మీటింగ్‌హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో 250 మంది ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్ష నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఏటా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి మేనేజర్ సాయికుమార్, డాక్టర్లు ప్రణీత, సీమంత, కల్యాణి, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల (1973–74) పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. వారు చదువుకుని 50ఏళ్లు పూర్తి అయిన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2.50లక్షలతో పాఠశాల చుట్టూ ప్రహరీ గ్రిల్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ముఖ్య అతిథిగా డీఈవో రవీందర్ హాజరై మాట్లాడారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రకాష్, రాజసింహుడు, నర్సింహరావు, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కీలక శాఖలన్నీ కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే..

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కీలక ప్రభుత్వ శాఖలన్నీ కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉన్నాయని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అన్షుమాన్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలను విస్మరించిందన్నారు. జర్నలిస్ట్ ఫోరం నేత విఠల్ బీసీలకు ప్రభుత్వాలు సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. 2014లో సకల జనుల సర్వేచేసి ఇప్పటివరకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు పాల్గొన్నారు.

ఒకే నామినేషన్ దాఖలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి కేవలం ఒక నామినేషన్ దాఖలైంది. ఈనెల 3 నుంచి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఇంకా మూడు రోజులు మాత్రమే నామినేషన్లకు గడువు ఉంది. కాగా ఇంకా నామినేషన్ల ప్రక్రియ ఊపందుకోవడం లేదు. ప్రధాన పార్టీలు ఇంతవరకు నామినేషన్లే వేయలేదు. మంగళవారం స్వతంత్ర్య అభ్యర్థిగా జిల్లా కేంద్రానికి చెందిన మున్నూర్ రవి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి అనిల్ కుమార్‌కు అందజేశారు. 8న బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. 9న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్ వేయనున్నారు. అదేరోజు కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేస్తాడని తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబాబాద్‌లో ఈనెల 10, 11 తేదీల్లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఉషు (మార్షల్ ఆర్ట్స్) పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ స్పోర్ట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్ కే.మోసీన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో తమ షోటోకాన్ విద్యార్థులు అండర్–19 విభాగంలో అభిలాష్ (–56కేజీ), అండర్–17 విభాగంలో కె.రాకేశ్ (–45కేజీ), ఆయేషా తస్లీం (–52కేజీ), రుహయా బేగం (–56కేజీ) ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను మంగళవారం ఎంవీఎస్ డిగ్రీకళాశాల మైదానంలో విద్యార్థులను ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్, మాస్టర్లు ఫహీం, మోసీన్ అభినందించి సన్మానించారు.

అనిరుధ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



కల్లెపల్లిలో కాంగ్రెస్ ప్రచారం

రాజాపూర్: కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం మండలంలోని కల్లేపల్లి, రాయపల్లి, తదితర గ్రామాల్లో ఆయన తల్లి శశికళా రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ విలువైన ఓటును అనిరుధ్‌రెడ్డికి వేసి, ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. నాయకులు నరహరి, రమేష్, కృష్ణయ్య, నసీర్, వెంకలయ్య, గోవర్దన్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.